# జైలు కథలు 14

# భ్రమ

"క్రమలున్నందుకు కలలు తప్పవు" అన్నారు. కాని కల ప్రతిదీ నిజం కాదు. అదే శేఖర్ జీవితంలో గొప్ప దుష్పలితాన్ని సృష్టించింది. అవి నేను కొత్తగా జైలుకు వెళ్ళిన రోజులు. సాయంకాలం నాలుగ్గంటలైంది. కబాడీ ఆడుతూవుంటే నేను కూడా చూస్తూ నుంచున్నాను. ఎవరో భుజం తడితే వెనుకకు మరలి చూశాను.

"నా పేరు శేఖర్" తనను తానే చిరునవ్వుతో పరిచయం చేసుకొన్నాడు.

"అలా వెళ్ళి కూర్చుందాం రండి" నా యిష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా నన్ను చేయి పట్టుకుని దూరంగా వున్న వేపచెట్టువేపు తీసుకొని వెళ్ళాడు. భుజంపై వున్న తువాలు పరిచాడు. ఇద్దరం కూర్చున్నాము.

* * *

శేఖర్ కొల్లాపూర్ గ్రామంలోని ఒక గ్రామవాసి. తల్లి తండ్రులకు వొక్కగానొక్క సంతానం. అల్లారుముద్దుగా పెరిగినవాడు. అదే గ్రామానికి చెందిన రఘు-శేఖర్ స్నేహితుడు. ఇద్దరూ మంచి యౌవనంలో వున్నారు. పెండ్లిచేయాలని పెద్దవాళ్ళు ఆరాటపడుతున్నారు. రఘు చెప్పిన మాటలవల్ల శేఖర్ మనసులో విషబీజం నాటుకుంది.

రఘు వొకనాడు సోదాహరణంగా చెప్పాడు. ఆడవారు అవకాశవాదులనీ, మగవారిని ఎంతవరకు అవసరమో, అంతవరకు చక్కగా వుపయోగించుకొని, తరువాత ఎంగిలి విస్తరాకుకన్నా హీనంగా చూస్తారని. అందునా ఆడవారిలో శీలవతులు తక్కువనీ చెప్పాడు.

ప్రక్క గ్రామంలోవున్న సోమసుందరంగారి తృతీయ ఫలం. అంజలితో వివాహమైంది శేఖర్‌కు. మొదటి రాత్రి మరువలేని మరపురాని తొలిరేయి. స్త్రీ. పురుష యౌవన నందనోద్యానంలో నవవసంతాలు చిగురించే రాత్రి. రెండు హృదయాలు. తనువులు వొక్కటిగా సంధించే. కలలు పండించే కమ్మని రాత్రి. మెల్లగా అజంతా శిల్పంలా, సిగ్గులుదేరిన సిగ్గుల మొగ్గగా నడచివస్తున్న అంజలివేపు నిశితంగా చూశాడు శేఖర్. రఘు మాటలు మనసులో మెదులుతూ వున్నాయి. "ఈమెను నమ్మవచ్చా?" తనలో తాను ప్రశ్నించుకొన్నాడు. ఆమె అమాయకమైన కళ్ళు సిగ్గుతో కెంపులైన చెక్కిళ్ళు. కొత్త అనుభవం తలపుతో తడబడుతున్న అడుగులు....నటన కాదుగదా! అనుమానించాడు శేఖర్. తొలిరేయి ఆలోచనలకు అర్పించాడు. ఎపుడో తెల్లవారుజామున కునుకు పట్టింది

స్నానం ముగించి. టిఫిన్. కాఫీకానిచ్చి అలా వీధిలోకి వెళ్ళాడు శేఖర్. ఆలోచిస్తున్నాడు. రాత్రి తన ప్రవర్తనను అపార్థం చేసికొని అంజలి తనను అసమర్థుడు అనుకోదుగదా? ఈ ఆలోచనతో వీపు మీద ఎవరో ఛెళ్ళున చరచినట్లుగా ఫీలయాడు అదే నిజమైతే.... ఏమో....ఇక ఆలోచించలేక యింటిముఖం పట్టాడు. తనను వీధిలోని వారంతా గుచ్చి గుచ్చి చూస్తున్నట్లుగా వుంది. ఇంటి ద్వారంవద్దకు వచ్చేసరికి లోపలినుంచి పెద్దగా నవ్వులు వినిపించాయి. తలుపు మెల్లగానెట్టి లోన ప్రవేశించాడు. తన భార్య మరో యువకునితో కలసి నవ్వుతోంది. శేఖర్ రాకను గమనించి తల నిండుగా చీరె కప్పుకొని లేచి. వడి వడిగా యింట్లోకి వెళ్ళింది అంజలి.

శేఖర్ నొసలు ముడివడింది ప్రశ్నార్థకంగా కనుబొమలు దగ్గరయాయి.

"నా పేరు ఆనంద్. అంజలి మామను. చాల దూరంలో వుండటంవల్ల పెండ్లికిరాలేకపోయాను....సారీ...." ఎంతో మంచిగా. స్నేహపాత్రంగా. సంస్కారవంతంగా ఆనంద్ మాట్లాడినప్పటికీ అనుమానం తలెత్తింది శేఖర్‌లో.

రెండవ రాత్రి పిచ్చి పిచ్చి ఊహలతో మెల్లగా నిద్రలోకి జారిపోయాడు. ప్రక్కనున్న భార్యతో కనీసం వొకమాట కూడా మాట్లాడలేకపోయాడు. ఆనంద్ తనభార్యను బలాత్కరిస్తున్నాడు. భార్య అతనితో పెనుగులాడుతోంది. శేఖర్ కోపం హద్దు దాటింది. శేఖర్ అమాంతం ఆనంద్ కంఠాన్ని పట్టి పిసుకసాగాడు. గట్టిగా.... యింకా గట్టిగా.... శక్తికొలదీ నొక్కాడు. తృళ్ళిపడి లేచిన శేఖర్ రెండు చేతులలో అంజలి గొంతు యిరుక్కొనివుంది. వొక్కసారిగా కంపించిపోయి చేతులు తీసివేశాడు. కాని అప్పటికే ఆమెలో ప్రాణంలేదు.




శేఖర్‌ను ఎలా వూహించుకోవాలో అర్థం కాక పైకి చూస్తుండిపోయాను. శేఖర్ కళ్ళ నీళ్లు గమనించి కూడా ఏమీ మాట్లాడలేకపోయాను.

—'ప్రసాద్'